
క్లుప్తంగా

అలరించిన భక్తి సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక సంగడిగుంట మంత్రివారిబజార్‌లోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వరరాగ సుధా గుంటూరు ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు సాయిబాబాశర్మ, కృష్ణ కుమారి బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. అనంతరం పుర వీధుల్లో స్వామి ఊరేగింపు వైభవంగా కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమాలను అర్చక స్వాములు పాలపర్తి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

విశ్వానికి తొలి మేలుకొలుపు, తొలి వేలుపు గణపతి



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం రాత్రి శంకరాచార్య విరచిత గణేష్ పంచరత్నంపై ప్రవచనం నిర్వహించారు. ఆలయ పాలక మండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సుందరసత్సంగ సభ్యులు కేవీ కోటేశ్వరరావు ప్రసంగిస్తూ విశ్వానికి తొలి మేలుకొలుపు, తొలి వేలుపు గణపతి అన్నారు. సర్వుల నుంచి ప్రథమ వందనం అందుకొనేవాడు గణపతి అని తెలిపారు. కార్యక్రమంలో మన్నవ రవిప్రసాద్, పి.శివారెడ్డి, తూనుగుంట్ల సుందరరామయ్య పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు పరికరాల వితరణ



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగంలో పూర్వ ఆర్థోపెడిక్ విభాగం అధ్యాపకులు, రామచంద్ర జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్ తరఫున డాక్టర్ శివయ్య రూ.2 లక్షల విలువైన మన్మన్ పవర్ డ్రిల్‌ను ఆర్థోపెడిక్ విభాగానికి మంగళవారం బహూకరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, అధ్యాపక బృందం సమక్షంలో వితరణ చేశారు. డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఈ పరికరం ద్వారా ఎముకలకు డ్రిల్ చేయడం, స్క్రూ అమర్చుటకు, వైర్ అమర్చుటకు, రీప్లేస్మెంట్ శస్త్ర చికిత్స కొరకు పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. దీనిని వితరణ చేసిన డాక్టర్ శివయ్యను అభినందించారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



గుంటూరు మెడికల్: పల్నాడు జిల్లా మాచవరం మండలం, వేమవరం గ్రామం పేద రైతు కుటుంబానికి చెందిన పెరుగు రామ్ ప్రకాష్ అనే అభ్యర్థి ఈ సంవత్సరం జరిగిన నీట్ అండ్ యూజీ పరీక్షల్లో అఖిలభారత స్థాయిలో 8,822 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం గుంటూరు అమరావతి రోడ్డులోని ఆలా హాస్పిటల్‌లో హాస్పటల్ అధినేత, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు విద్యార్థికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మ్యాట్రిక్స్ విద్యాసంస్థల అధినేత పెరుగు ఏడుకొండలు, మంగా సైదులు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సంపతి వెంకటేష్ నగదును డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేసి విద్యార్థి రామ్‌ప్రకాష్‌ను సత్కరించారు.

ఎలుకల మందు తిని మహిళ మృతి

లక్ష్మీపురం: ఎలుకల మందు తిని మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసరావుపేటకు చెందిన పెద్ది ఎలీషా రాణి(21) నాలుగు సంవత్సరాల క్రితం కొండా వెంకటప్పయ్య కాలనీకి చెందిన కోటిని వివాహం చేసుకుంది. వీరికి ఒక పాప. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఎలీషా రాణి తొమ్మిది నెలలుగా శ్రీనివాసరావుపేటలోని ఇల్లు అద్దెకి తీసుకొని నివాసం ఉంటుంది. తల్లి లక్ష్మీ ఈనెల 23న కుమార్తె ఎలీషా రాణి వెళ్లింది. ఎలీషా రాణి తాను ఎలుకల పేస్టు తిన్న విషయం తల్లికి చెప్పడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఎలిషా రాణి మృతి చెందింది. విషయం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు.

‘ప్రైవేట్’ స్థలంలో రోడ్డు

- స్థలానికి నష్టపరిహారం ఇవ్వకుండా కాలయాపన
- అడ్డుకున్న కాకుమానువారితోట వాసులు
- స్టే ఇచ్చిన హైకోర్టు



కాకుమానువారితోట 5వ లైనులో రాకపోకలు సాగనీయకుండా స్థానికులు అడ్డుపెట్టిన కర్రలు, రాళ్లు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మమ్మల్ని మోసం చేసి మా స్థలాలను తీసుకుని మా స్థలాలను కలుపుకుంటూ రోడ్డు వేశారని.. మాకు వేరే చోట స్థలాలు ఇచ్చి వాటిని రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో నూతనంగా రోడ్డు వేస్తున్న క్రమంలో రోడ్డు నిర్మాణాన్ని స్థానిక వాసులు అడ్డుకున్న పరిస్థితి. ఈ ఘటన కాకుమానువారితోట 5వ లైనులో చోటుచేసుకుంది.

ఇది సంగతి...

కాకుమానువారితోట 5వ లైను నుంచి శ్రీనగర్, వసంతరాయపురాన్ని(బుద్ధుడు బొమ్మ 7/5) కలిపే రోడ్డు వద్ద 320 గజాల స్థలం ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించి. ఈ స్థలాల వెనుక నగరపాలక సంస్థ రోడ్డు ఉండేది. దాని పక్కనే కార్మిక శాఖకు చెందిన స్థలం కూడా ఉంది. కాకుమానువారితోట నుంచి శ్రీనగర్‌ను కలిపే రోడ్డుకు అడ్డుగా ఉన్న 320 గజాల స్థలాన్ని కార్పొరేషన్‌కు ఇవ్వాలని 2001లో నోటీసులు ఇచ్చారు అప్పటి అధికారులు. అయితే అప్పటి అధికారులు పక్కనే ఉన్న రిజర్వు సైట్‌లో స్థలాలు కేటాయించి దానికి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పి



హైకోర్టు స్టే ఉన్నా, కర్రలు, రాళ్లను తొలగించేందుకు పొక్లెయిన్‌తో వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు

బాధితులకు స్వాధీనం అగ్రిమెంట్ కూడా ఇచ్చారు. 2003లో ఆ స్థలాల మీదుగా కాకుమానువారితోట నుంచి వసంతరాయపుం, శ్రీనగర్‌కు అనుసంధానంగా రోడ్డు వేశారు. రిజర్వు స్థలంలో ఇచ్చిన స్థలాలను రిజిస్టర్ చేయాలని గత 22 సంవత్సరాలుగా నగర కమిషనర్లను కలిసి విన్నవించినా ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. తాజాగా ఇదే రోడ్డుపై నూతనంగా సిమెంట్ రోడ్డు వేసేందుకు అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టడంతో అక్కడ రోడ్డు నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. స్థల యాజమానులు షేక్ సుభాని, బత్తిని చెంగళరావు హైకోర్టును ఆశ్రయించారు. మే 15వ తేదీన హైకోర్టు స్టే విధించింది. స్టే రావడంతో రోడ్డుకు అడ్డుగా రాళ్లు, కర్రలు, పెట్టి ఆ రోడ్డు మీద రాకపోకలు రాకుండా నిలిపివేశారు.

టౌన్ ప్లానింగ్ అధికారులు హడావుడి..

హైకోర్టు స్టే ఉన్నాకి టౌన్ ప్లానింగ్ టీపీఎస్ లక్ష్మణస్వామి కర్రలు, రాళ్లు తొలగించేందుకు పొక్లెయిన్‌తో వచ్చారు. దీనిని కూడా తాము అడ్డుకోవడంతో తిరిగి వెళ్లిపోయారు.

కేటాయించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి



2003లో తమ స్థలాలను నగరపాలక సంస్థ తీసుకుని మా స్థలాల మీదుగా రోడ్డు వేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా వేరే చోట స్థలాలు ఇప్పించి స్వాధీన అగ్రిమెంట్ కూడా చేశారు. వాటికి రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని చెప్పి 22 సంవత్సరాలైనప్పటికి ఇంత వరకు ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడు మరలా కొత్తగా రోడ్డు వేస్తున్నారు..ఇప్పటికైనా మాకు కేటాయించిన స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయాలి.

– బత్తిన చెంగళరావు, బాధితుడు

మాకు న్యాయం చేయాలి



మాకు జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించాం. కోర్టు స్టే విధించింది. కాని టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డుకు అడ్డుగా మా స్థలంలో ఏర్పాటు చేసుకున్న కర్రలు తొలగించేందుకు ప్రయత్నం చేసి దౌర్జన్యం చేస్తున్నారు. 2003లో నగరపాలక సంస్థ ప్రత్యామ్నాయంగా కేటాయించిన స్థలంలో నేను ఇళ్లు కట్టుకుని ఉంటున్నా. దానికి ఇంత వరకు రిజిస్ట్రేషన్ లేదు. మాకు న్యాయం చేయాలి.

– షేక్ సుభాని, బాధితుడు

ప్రతిభావంతులకు నిలయాలుగా ప్రభుత్వ పాఠశాలలు

ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభావంతులైన విద్యార్థులకు నిలయాలుగా మారాయని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను ఆయన మంగళవారం ఆర్జేడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారని, పాఠశాలల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులతో పాటు సుశిక్షితులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుబాటులో ఉందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకుని పేరు, ప్రఖ్యాతులు గడించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఎస్‌కేబీఎం హైస్కూల్ నుంచి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన పఠాన్ మొబీనా ఖాన్, ఎం.నవ్యరెడ్డి, షేక్ ఇమామున్నీసాను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాజావలి, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, ఉపాధ్యాయులు పి.లలితబాబు, ఎం. శివన్నారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. దేవాపురం, కృష్ణనగర్ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయం

పట్నంబజారు: క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయమైన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. నెహ్రూనగర్ 9వలైనులో నివాసం ఉండే కె.రాఘవరావుకు ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 6న అతడి క్రెడిట్ కార్డు నుంచి రూ.49,320 వేరే సంస్థకు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్ వచ్చింది. 1930 ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం కనబడలేదు. బాధితుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అణచివేయాలని చూస్తే కుదరదు..

లక్ష్మీపురం: అణచివేయాలని చూస్తున్న కొద్ది వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం అవుతున్నారని ఇది చరిత్ర చెబుతున్న వాస్తవమని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగం) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చరిత్రకు వైఎస్ జగన్ అవసరం ఉంటే ఆయన్ను చరిత్రే బతికించుకుంటుందని చెప్పారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి.జగన్, లక్ష్మణరావు తదితరులు

లక్ష్మీపురం: దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో గిగ్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర నాయకుడు బి.జగన్ పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం సీఐటీయూ నగర కార్యాలయంలో ఎస్.బ్రహ్మయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిగ్ వర్కర్స్‌కు కనీస ఆదాయం, ఉద్యోగ భద్రత, రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. లేబర్ కోడ్స్ వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ మారుతున్న కాలంలో గిగ్ వర్కర్స్‌కు సమగ్ర చట్టం లేని కారణంగా భౌతిక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి నివారణకు సమగ్ర రక్షణ చట్టం ఏర్పాటుకు కర్ణాటక, రాజస్థాన్ తరహా గిగ్ వర్కర్స్ రక్షణ కోసం ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో బి.ఉదయ్, రానా, నరసింహారావు, విజయ్, సతీష్, రామారావు, వాల్మీకి, ఉమా మహేశ్వరరావు, వరప్రసాద్, మరియబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేసే ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరింది. ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సంయుక్త కార్యదర్శి వేపూరి రవిశంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులకు, డ్రైవర్లకు మాత్రమే జీతాలు పెంచిన విధంగానే ఇంజినీరింగ్ విభాగంలో రకరకాల పనులు చేసే కార్మికులకు కూడా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె గురించి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు విన్నవించినప్పటికి ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కార్మికులకు సమస్యలను పట్టించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులతో సీడీఎంఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాయపూడి కోటిబాబు, గాలి ఏసుబాబు, రమాదేవి, కోటేశ్వరమ్మ, అశోక్ పాల్గొన్నారు.

28న మానవ హక్కుల పరిరక్షణ సదస్సు

- ‘చలో తెనాలి’కి ప్రజాసంఘాల పిలుపు
- అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాంతకుమార్, వై.నేతాజీ, దళిత ప్రజా సంఘాల నేతలు

లక్ష్మీపురం/నెహ్రూనగర్: దళిత, ప్రజా సంఘాలు పిలుపు మేరకు మానవ హక్కుల పరిరక్షణ సదస్సు ఈ నెల 28న ‘చలో తెనాలి’ పేరుతో నిర్వహించనున్నట్లు ఇండియా లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతకుమార్ తెలిపారు. స్థానిక లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాంతకుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ మాట్లాడారు. తెనాలిలో పోలీసులు దళిత, మైనారిటీ యువకులపై అక్రమ కేసులు పెట్టి బహిరంగంగా దాడి చేసిన ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడిషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడిన తెనాలి–2 టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ రాములు నాయక్, తెనాలి–3 టౌన్ పోలీస్ స్టేషన్ రమేష్ బాబుతో పాటు కానిస్టేబుల్‌పై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టీ, వీసీకే పార్టీ రాష్ట్ర నాయకులు జయసుధ, స్టాలిన్, భీమసేన సేవాదళ్ అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, నాయకులు దేవరాజు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అనిల్, నాయకులు వినయ్ కుమార్, బీఎస్పీ నాయకులు చిరతనగుంట్ల వాసు, పౌర హక్కుల సంఘం నాయకులు శిఖా సురేష్ కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

ఘనంగా వికసిత భారత్ సంకల్ప సభ



సమావేశంలో మాట్లాడుతున్న నడ్డి నాగమల్లేశ్వరి, తిరుపతిరావు

గుంటూరు మెడికల్: 2047 నాటికి వికసిత్ భారత్ బీజేపీ లక్ష్యం అని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్ అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం, నాలుగో మండల అధ్యక్షుడు వక్కలగడ్డ తిరుమలరావు అధ్యక్షతన వికసిత భారత్ సంకల్పసభ అరండల్‌పేటలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ప్రధానిగా నరేంద్రమోదీ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా వికసిత భారత సంకల్ప సభలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ మోదీ అనుసరించిన విదేశీ దౌత్య విధానాలు, రాజ నీతిజ్ఞత, అవినీతి రహిత పాలన, కోవిడ్ సమయంలో ఉచిత వ్యాక్సిన్ దేశ ప్రజలతో పాటు ఇతర దేశాలకు అందజేశారన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు దారా సాంబయ్య, కార్యక్రమ కో కన్వీనర్ మంత్రి సుగుణ మాట్లాడారు. అనంతరం జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు దారా అంబేడ్కర్ 2047 వికసిత భారత్ సంకల్ప సభ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీకృష్ణ చైతన్య, మంత్రి సుగుణ, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్, దర్శనపు శ్రీనివాస్, బజరంగ్ రామకృష్ణ పాల్గొన్నారు.

విధుల్లో బాధ్యతాయుతంగా పనిచేయాలి



అంగన్‌వాడీ హెల్పర్లకు వర్కర్‌గా ప్రమోషన్ ఆర్డర్లను అందిస్తున్న విజయలక్ష్మి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ వర్కర్లు బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వర్తించాలని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీవో జి.విజయలక్ష్మి అన్నారు. ప్రాజెక్టు పరిధిలో నలుగురు అంగన్‌వాడీ హెల్పర్లకు అంగన్‌వాడీ వర్కర్లుగా ప్రమోషన్ కల్పించారు. వీరికి మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో నియామక ఉత్తర్వులు అందించారు. ప్రత్తిపాడు ముస్లిం ఏరియా అంగన్‌వాడీ హెల్పర్ షేక్ హసీనాను ప్రత్తిపాడు మెయిన్ అంగన్‌వాడీ సెంటరుకు.. పెదనందిపాడు ఎన్టీఆర్ కాలనీ సెంటరు హెల్పరు కె.నాగమణిని కొత్తపాలెం అంగన్‌వాడీ సెంటరుకు.. కాకుమాను మండలం బికెపాలెం ఓసీ సెంటరు హెల్పరు డి.లక్ష్మిను బికెపాలెం ఓసీ సెంటరుకు.. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు మెయిన్ సెంటరు హెల్పరు వి.కృష్ణకుమారిను అదే సెంటరుకు అంగన్‌వాడీ వర్కరుగా నియమించామని సీడీపీవో తెలిపారు. సమర్థవంతంగా నూతన అంగన్‌వాడీ వర్కర్లు విధులు నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సెక్టార్‌ల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి కిట్టు అందించాలి



ఎస్‌ఆర్‌వీఎంకే స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎంఎస్‌ఏ డైరెక్టర్ పార్వతి

ప్రత్తిపాడు: ప్రతి విద్యార్థికి ఎస్‌ఆర్‌వీఎం కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎంఎస్‌ఏ డైరెక్టర్ పి.పార్వతి అన్నారు. పెదనందిపాడులోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. కిట్ల వివరాలను ఎంఈవో ముద్దన శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు వెళ్లిన కిట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులందరికీ అందించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం స్థానిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంవో డి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణన్ సూడెంట్ కిట్‌లు పంపిణీ చేయాలని ఆర్‌ఎంఎస్‌ఏ డైరెక్టర్ పార్వతి అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేసినట్లు ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ ఈ సందర్భంగా తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



పొన్నూరు: మండల పరిధి పచ్చల తాడిపర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మై ఛాయిసెస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. మానవ అక్రమ రవాణా, గృహ హింస లేని గ్రామాలే సురక్షిత గ్రామాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రమీలదేవి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, అవసరానికి మించి ఉపయోగించకూడదని అన్నారు. ల్యాంప్ సంస్థ ప్రోగ్రాం ట్రైనర్ తురకా మంగయ్య విద్యార్థులకు ఉచితంగా కామిక్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, సంస్థ ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయిని సరళాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త సంపద షెడ్‌లను ఉపయోగించాలి



అప్పాపురం(కాకుమాను): గ్రామాలలో నిర్మించిన చెత్త సంపద షెడ్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ జ్యోతి బసు అన్నారు. మండలంలోని అప్పాపురం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. చెత్త ద్వారా సంపద సృష్టించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో షెడ్‌లను నిర్మించినట్లు ఆయన తెలిపారు. రోజూ గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను తడి, పొడి చెత్తగా విభజించి షెడ్‌లలో ఉంచాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుందని.. కాకుమాను పంచాయతీ కార్యాలయం వద్ద ఫౌండేషన్ దశలో ఉన్న స్థలంలో నూతన భవనం నిర్మించే విధంగా ఉన్నత స్థాయి అధికారులతో చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఓ సాయి కుమార్, ఎంపీడీఓ యుగకీర్తి, డెప్యూటీ ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.